# ఇల్లరికం

"గుడ్‌మార్నింగ్ సార్" తలెత్తాను రాజా ఈ మధ్యనే మా ఆఫీసులో ఎల్డీగా జాయినయాడు. పబ్లిక్ సర్వీస్ కమీషన్ కేండెట్ "ఎస్ వాట్ కెన్ ఐడూఫర్‌యు" "సర్ నాకు ప్రైవేట్ ఫరమ్‌లో జాబ్ వచ్చింది సార్ మద్రాసువెళ్ళి చేరాలి. వెళ్ళిపోతానుసార్. దయచేసి తమరు రిలీవ్‌చేస్తే"

అలాగా "మై హార్టీ కంగ్రాట్స్ తప్పక రిలీవ్ చేస్తాను. ఆర్డర్సు రాసీయండి"

"థ్యేంక్యు సార్"

"అయితే మీరు వెళ్ళిపోతారన్నమాట కొద్దిగా పని నేర్చుకుంటున్నట్లుంది, ఎందుకు వెళ్ళిపోవడం ఇక్కడే ఉండండి. ప్రభుత్వ ఉద్యోగం అయితే చాలా సౌకర్యాలు ఉంటాయి".

"ఏం ఉద్యోగం లెండిసార్ ప్రైవేట్ కంపెనీ అయితే కష్టపడి పని చేస్తే తొందరగా ప్రమోషన్ వస్తుంది. ఇక్కడ అయితే ఎంతకొట్టుకున్న ఎదుగుబొదుగూ ఉండదుకదా సార్".

అతను డిపార్టుమెంటులో చేరి కొద్దిరోజులయినా అప్పుడే నగ్న సత్యం కనిపెట్టినట్లనిపించింది నాకు.

ఆరునెలలు అయింది. తనను రిలీవ్ చెయ్యమని రాజా అడగటం లేదు! పెద్ద ఉద్యోగం. పెద్దజీతం వచ్చే అవకాశాన్ని జారవిడుచుకునే తెలివితక్కువవాడుకాదు రాజా. అయితే కారణం ఏమిటి?

ఆరోజు ఇంట్లో ఏదో అవసరమైన పనివుండి ఒక గంట ఆలస్యంగా ఆఫీసుకు వచ్చాను. ప్రతి సెక్షనులో ఒక బల్లదగ్గర గుమిగూడి కబుర్లు చెప్పుకుంటున్నారు.

రాజా ఉపన్యాసం దంచేస్తున్నాడు "ప్రభుత్వోద్యోగం వదులుకునే తెలివితక్కువ వాడెవడోయ్. మీరందరూ భలేవారేనే, హాయిగా ప్రొద్దున్న తొమ్మిదిన్నరకు వస్తున్నాను, అటెండెన్స్‌లో సంతకంపెట్టి సెక్షన్ హెడ్‌కి

ఒక కాఫీ పంపించి పదిన్నరకు వస్తాను. అటు ఇటు రిజిస్టరు సర్దుతాను ఏదో పనివున్నట్లు సీరియస్‌గా పెన్ తెరిచి కూర్చుంటాను. పదకొండున్న రకు మళ్ళీ ఒకసారి కాఫీకి వెళతాను. పన్నెండుకి వస్తాను. మళ్ళాకాస్సేపు కూర్చుంటే పన్నెండున్నర అవుతుంది. ఇంటికివెళ్ళే సందడి మొదలు మధ్యాహ్నం హాయిగా నిద్రపోయి మూడుగంటలకు వచ్చి కాఫీ త్రాగి నాలుగున్నరకు వెళ్ళిపోతాను. సెక్షన్ హెడ్ నన్ను అడగడు. ఆయనకు కావలసిన పనులన్నీ చూస్తుంటాను. ఆయన అడగకపోతే బాస్ ఎలా అడుగుతాడు? ఇదే ప్రయివేట్ జాబ్ అనుకో ఇలా కుదరదు, ప్రయివేటు వాళ్ళు మనల్ని పీల్చిపిప్పి చేస్తారు. సరిగా పనిచేయకపోతే జీతం ఇవ్వరు. ఇంక్రిమెంట్ ఇవ్వరు. తెలివిగలవాడెవడయినా ప్రభుత్వోద్యోగంలో చేరేక వదులుకుంటాడా. మనం ఇల్లరికం అల్లుళ్ళం అనుకోండి—'' ఇంకా ఏదో చెపుతున్నాడు.

లోపలకు వెళ్ళటానికి మనస్కరించక ఇంటికి తిరుగు ముఖం పట్టేను.

మర్నాడు నా గదిలో ఒక ప్రక్కగా ఒక బల్ల కుర్చీ వేయించాను. తొమ్మిదిన్నర అయింది రాజా వచ్చేశాడు.

"గుడ్ మార్నింగ్ సార్''

"మిస్టర్ రాజూ మీకు ఈ రోజునుండి నా గదిలో సీటు ఏర్పాటు చేశాను. మీకు ప్రైవేటు కంపెనీలో జాబ్ వచ్చింది కదా. బాగా పని నేర్చు కుంటే మంచిది. మిమ్మల్ని బాగా ట్రెయినప్ చేద్దామని ఇక్కడ నా దగ్గర సీటు ఏర్పాటుచేశాను. ఏమంటారు?''

రాజా ముఖంలో నెత్తురు చుక్కలేదు.

—o—